జి. టి. ఎక్స్‌ప్రెస్ జీనత్‌అమన్‌లా వయ్యారంగావచ్చి గూడూరు రైల్వేస్టేషన్లో ఆగింది. అప్పుడు సమయం రాత్రి ఏడు గంటలు. ప్రయాణీకులు హడావుడిగా ఎక్కుతున్నారు.

రెండు నిముషాల తరువాత గార్డు పచ్చ లైటు చూపించి విజిలు ఊదాడు. ఇంజను తన దైన రాగం ఆలాపించి ముందుకు కదిలింది. రైలు క్రమంగా స్పీడందుకుంది.

"నాపేరు పులిరాజు. నేను చండశాసనపు టి.టి.ఇ.ని. యమస్ట్రిక్టు. చూపించండి... మీ టికెట్లు" కంపార్టుమెంటుకు ఒక చివరినుంచి అరుచుకుంటూ వస్తున్నాడు పులిరాజు.

ఒక్కొక్కరి టికెట్ చెక్ చేస్తూ, అట్టకు



# పులిరాజు

బిగించబడిన ఛార్టులో టిక్ చేసుకొంటున్నాడు.

"ఇదేమిటి? నీ కంపార్టుమెంటు ఇదికాదు. యస్.ఎయిట్. ఇందులో ఎక్కావేమిటి?" చెల రేగిపోయాడు పులిరాజు.

"సార్. వీళ్లు మా బంధువులు. కొద్దిసేపు మాట్లాడి వెళ్దామని..." నచ్చజెబుతూ అన్నాడు ఆ ప్రయాణీకుడు.

"నో... నో... నేనసలే యమస్ట్రిక్టు. నువ్వీ పెట్టెలో ఎక్కడం నేరం. యాభై రూపాయలు పెనాల్టీ కట్టు" పుస్తకం తెరిచాడు పులిరాజు రశీదు రాయడానికి.

"సారీ సార్... దానికే పెనాల్టీ వేయాల్నా. నేను నా పెట్టెలోకి వెళ్తాలెండి" లేచాడు ఆ ప్రయాణీకుడు పులిరాజువంక కోపంగా చూస్తూ.

"నో... నో... నాటెటాల్. ఈ పులిరాజుతో పెట్టుకోకు. పెనాల్టీ కట్టి వెళ్లాల్సిందే" అంటూ యాభై రూపాయలకు పెనాల్టీ వ్రాసి రశీదిచ్చాడు.

పెనాల్టీ కట్టక తప్పలేదు అతనికి.

చెక్ చేసుకుంటూ వెళ్తున్న పులిరాజుకి ఒక చోట రిజర్వేషను లేని ప్రయాణీకుడు ఒంగోలు టికెట్‌తో తగిలాడు. వంద రూపాయలు పెనాల్టీ, ఒంగోలు వరకు రిజర్వేషను ఛార్జి మరో యాభైరూపాయలు కట్టమన్నాడు పులిరాజు.

"నా దగ్గర అంత డబ్బులేదు సామే! టికెట్ తీసుకొని రైలెక్కాను. దీంట్లో ఎక్కకూడదని నాకు తెలియదు"

"నో... నో... అవన్నీ నేనొప్పుకోను. పెనాల్టీ కట్టాల్సిందే. ఈ పులిరాజుతో పెట్టుకోకు. యమస్ట్రిక్ట్" అంటూ రశీదు పుస్తకం తీసాడు.

"సామే మట్టి పిసుక్కునే మొరటోడ్ని. ఒంగోలుకెల్తున్నా. ఇయ్యాల్టికి పోనీయండి సామే" వేడుకున్నాడు అతను.

"సీటు మీద ఈగవాలినా దానికి పెనాల్టీ వేస్తాను. ఏమనుకున్నావో ఈ పులిరాజంటే. డబ్బు బయటికి తియ్యి. లేకపోతే రైల్వే పోలీసుల్ని పిలుస్తాను. ఈ పులిరాజు రూటే వేరు" అంటూ పెనాల్టీ వ్రాసి రశీదు అతనికిచ్చాడు.

ఇక తప్పదన్నట్లు బొడ్లోంచి డబ్బు తీసి కట్టాడతను.

పులిరాజు అందరి టికెట్లు చెక్ చేస్తూ ముందుకు పోతున్నాడు. ఎవరి సీట్లో వాళ్లే కూర్చోవాలంటున్నాడు. అదే పెట్టెలో సీటు నంబరు మారినా రంకెలు వేస్తున్నాడు. పెనాల్టీలు రాస్తున్నాడు. సిగరెట్ తాగితే మండిపడుతున్నాడు.

జి.టి. ఎక్స్‌ప్రెస్ నెల్లూరులో ఆగింది. బ్రేక్‌ఫాస్ట్ చేసిన పెద్దాయన 'బ్రేవ్'మని త్రేన్చినట్లు అరచి, అక్కడ ఎక్కిన పాసింజర్లనుకూడా మోసుకుంటూ ముందుకు కదిలింది. పులిరాజు అక్కడ ఎక్కినవాళ్ల టికెట్లు కూడా చెక్ చేసాడు.

రైలు వేగం పుంజుకొంది. పట్టణ సరిహద్దు లుదాటి పొలాలు, చెట్లు, గుట్టల మధ్య పయ

పొట్లూరు సుబ్రహ్మణ్యం

నిస్తూ ఉంది. బయట వెన్నెల తెల్లగా కాంతివంతంగా ఉంది. చల్లటిగాలి కంపార్టుమెంటులోకి వీస్తూ హాయిని కలిగిస్తోంది. రైలు 'తలమంచి' అనే పేరు గల రైల్వేస్టేషనును సమీపించింది. 'తలమంచి' రైల్వేస్టేషను చిట్టడవి మధ్య సదరు ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ 'కాషను ఆర్డరు' ఉండడంతో రైలు స్లోగా పోతూఉంది.

వాకిలి దగ్గరకు వచ్చిన పులిరాజు గుమ్మం దగ్గర నిలబడి ఉన్న ప్రయాణీకుల్ని చూసి 'గయ్యి'మన్నాడు.

"ట్రెయిన్ వెళ్తూంటే వాకిలి దగ్గర నిలబడి ప్రయాణం చేయడం నిషిద్ధం. లోపలికి వచ్చి మీమీ సీట్లలో కూర్చోండి. కాదంటే పెనాల్టీలు వ్రాస్తాను. ఈ టైగర్ పులిరాజుతో పెట్టుకోకండి" అంటూ హడలగొట్టి వాళ్లని లోపలికి పంపించాడు.

అంతేగాక దగ్గరుండి వాళ్లను వాళ్లవాళ్ల సీట్లలో కూర్చోబెట్టి తలతిప్పి మళ్లీ వాకిలివైపు చూసాడు. అప్పుడు జరిగిందా హఠాత్సంఘటన...

రైలు ఇరవై కిలోమీటర్ల స్పీడులో మాత్రమే పోతోంది. రైల్వేలైనుకు అటూ ఇటూ ఉన్న చిట్టడవి చెట్లలోంచి 'లాంగ్‌జంప్'లు చేస్తూ గుట్టల్ని దాటుకుంటూ వచ్చిన చిరుతపులి చిన్న జంప్ చేసి సాక్షాత్తూ పులిరాజున్న పెట్టెలోకి అవలీలగా దుమికింది. కిటికీ దగ్గర వాకిలివైపుకున్న టి.టి.ఇ. సింగిల్ సీటులో ఎక్కి వెనుక కాళ్లు ముడిచి, ముందు కాళ్లమీద కూర్చుంది. తోక మాత్రం పొడవుగా క్రింద వ్రేలాడుతూ ఉంది.

పులిరాజు వణికిపోయాడు. మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెనుకకు వచ్చి చప్పున అప్పర్ బెర్త్ మీద ఎక్కి కూర్చున్నాడు. ఆ భయంతో ఒళ్లంతా చెమటలు పట్టాయి. ఆశ్చర్యంగా తనవైపు చూస్తున్న ప్రయాణీకులకు సైగ చేసి వాకిలివైపు చూపాడు. వెంటనే పై బెర్తుల మీద ఎక్కమన్నట్లు సైగ కూడా చేసాడు. రైలు కాషన్ దాటి స్పీడందుకుంది.

ప్రయాణీకులు వాకిలి దగ్గరకు వచ్చి చూసి బిత్తరపోయారు. ఒళ్లంతా మచ్చలున్న అయిదడుగుల పొడవున్న చిరుతపులి టి.టి.ఇ. సీట్లో దర్జాగా కూర్చొని ఉంది. అప్పుడే అడవిలో దేన్నో చంపి ఫలహారం చేసి వచ్చింది కాబోలు మూతంతా రక్తంతో నిండిఉంది. పొడవైన తన నాలుక చాపి మూతి నాక్కొంటోంది. తన వాడైన గోళ్లతో మధ్య మధ్య తలుపుల్ని గీకుతోంది. అదేపనిగా తోకనాడిస్తూ వాకిట్లోంచి బయటకు చూస్తోంది.

అంతే... జనం గుండెల్ని అరచేతుల్లో పెట్టుకొని శబ్దం చేయకుండా కంపార్టుమెంటు మధ్యకు పరుగెత్తారు. ఆడవాళ్లను, పిల్లల్ని అప్పర్‌బెర్త్ మీదకు ఎక్కించారు. తరువాత తామూ ఎక్కారు.

"సామే తమరు ఈగవాలినా పెనాల్టీ ఏస్తానంటిరే. నాకు పెనాల్టీ ఏయడం గాదు. తమరి సీట్లో అసలు పులిరాజుగోరు కూరుసోనుండారు. ఆరికి పెనాల్టీ రాసి వసూలు సెయ్యండి సూద్దాం. మాటంటే మాటే మరి" అన్నాడు టి.టి.ఇ. పులిరాజుకు ఎదురుబెర్తుమీద ఎక్కి ఉన్న ఒంగోలు పాసెంజరు.

"దానికి పెనాల్టీ వేస్తే, నన్ను పెనాల్టీ క్రింద తినేస్తుంది. జోకులెయ్యకయ్యా ఈ స్ట్రిక్టు పులిరాజుతో" కంగారుకు కోపం జోడించి వణుకుతూ అన్నాడు పులిరాజు.

"అయితే నువ్వు టిక్టు టి.టి.ఇ. పులిరాజువి కాదని ఒప్పుకో" అన్నాడు అతను

తిరిగి.

"నేను ఎప్పటికీ స్ట్రిక్టు టి.టి.ఇ.నే. నేను పేరుకు మాత్రమే పులిరాజుని. అదే అసలు పులిరాజని ఒప్పుకొంటున్నా" చిన్నగా అన్నాడు.

రైలు వెళుతూనే ఉంది. టాప్‌బెర్తుల మీద ఉన్నవాళ్లు భయపడుతూనే చిరుత పులి వేగం గురించి, అది దూకే దూరం గురించి మాట్లాడు కొంటున్నారు. కొందరు ట్రెయిన్ ఛెయిను లాగు దామంటున్నారు.

"ఇది లాస్టు కంపార్టుమెంటు. ఎక్కడ అడవిలో ఆగుతుందో రైలు. అది లోపలికిదూకి మనల్ని ఎంతమందిని ఫలహారం చేస్తుందో, ఒక మనిషి ప్రాణం పోయినా అది ఎంతో వి లువయింది. కనుక నిశ్శబ్దంగా ఊరుకుందాం" అని సలహా ఇచ్చారు మరికొందరు.

ఒంగోలు స్టేషను వచ్చేదాకా రైలు ఆగే అవ కాశం లేదు. నెల్లూరు తరువాత అదే నెక్స్ట స్టాపు.

ఇంతలో పెట్టెకు ఈ చివరి సైడ్ అప్పర్ బెర్త్ మీద కూర్చుని చిన్నగా ఆంజనేయజపం చేస్తున్న రైల్వేకానిస్టేబుల్‌కు ధ్యానభంగం చేస్తూ, "అదేమిటయ్యా చేతిలో తుపాకి పట్టుకొని ఆం జనేయ దండకం చదువుతావు. వెళ్లి ఆ పులిని కాల్చి చంపు" అన్నాడు అతని ప్రక్కనే కూర్చున్న ప్రయాణీకుడు.

"వన్యప్రాణి సంరక్షణ చట్టం క్రింద జంతు వుల్ని చంపరాదయ్యా. పులిని చంపి నా ఉద్యో గం పోగొట్టుకోమంటావా. నేను పై అధికారుల ఉత్తర్వులు లేనిదే కాల్చి చంపను".

"ఇప్పుడు ఇవన్నీ జరిగేపనేనా" తిరిగి అన్నాడు ప్రయాణీకుడు.

"అదే నేనూ చెప్పేది" అన్నాడు రైల్వే కాని స్టేబులు.

ఇంతలో చిరుతపులి పెద్దగా గాండ్రిం చింది.

దాంతో వాళ్ల సంభాషణ ఆగిపోయింది. అందరూ వాదోపవాదాలుమాని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. రైలు కొద్దిసేపటికి ఒంగోలు స్టేషన్ను సమీ పించింది. రైలు స్లో అయింది. చిరుతపులి దర్జాగా నిజమైన పులిరాజుననిపించుకొంటూ రైల్లోంచి గెంతి, పచ్చని పంటచేలల్లోకి వెళ్లి పోయింది.

అయిదునిముషాల తరువాత ఒంగోలు రైల్వేస్టేషన్లో ఆగింది జి.టి. ఎక్స్‌ప్రెస్. అన్ని కంపార్టుమెంటులూ జనంతో కిటకిటలాడుతూ ఉంటే, ఈ కంపార్టుమెంటు ఖాళీగా ఉండడం చూసిన ప్రయాణీకులు సంకోచిస్తూ స్టేషను మాస్టరుకు చెప్పారు. రైల్వే పోలీసు సిబ్బందితో బాటు పెట్టెలోకి ఎక్కిన స్టేషను మాస్టరు, గార్డు, మిగతా సిబ్బందికి టాపు బెర్తుల మీద కూర్చొని టి.టి.ఇ., రైల్వే కానిస్టేబులుతో బాటు బిక్కు బిక్కుమంటున్న ప్రయాణీకులు కనిపించారు.

రైల్వే సిబ్బందిని చూసిన టి.టి.ఇ. పులి రాజు, రైల్వేకానిస్టేబులు క్రిందికి దూకారు. పైన ఎక్కిఉన్న మగవాళ్లు, స్త్రీలు క్రిందికి దిగి పిల్లల్ని అందుకొని హాయిగా గాలిపీల్చుకున్నారు. ఎవ రి సీట్లలో వాళ్లు కూర్చున్న తరువాత జరిగిం దంతా తెలుసుకున్నారు రైల్వే సిబ్బంది.

పులిరాజు తన నిజాయితీని ఋజువు చేసు కుంటూ రైల్వే అధికారులు వారిస్తున్నా వినకుం డా ఒకవ్యక్తి నెల్లూరు నుంచి ఒంగోలుకు టికెట్ లేకుండా ప్రయాణించినట్లు వ్రాసి, దానికి రైలుఛార్జి, పెనాల్టీ వేసి, రశీదు వ్రాసి ఆ డబ్బు తన జేబులోంచి తీసి కట్టాడు. ●